# యాత్ర

కట్టమంచి రామలింగారెడ్డిగారికి మన సాంప్రదాయాల మీద, మన పూర్వీకుల మీద గౌరవంట. 'ట' అని ఎందుకంటున్నానంటే ఆ మాట ఆయన నాతో అనలేదు. మా నాన్నగారు అనేవారు. ఈయన ఆయనద్దగ్గర పన్చేసేవారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, వారు వ్రాసిన కావ్యం. చదువు నాలుగు భాగాలని, మొదటి భాగం గురువులు బోధించగా నేర్చుకొనేది అని, రెండవ భాగం పుస్తకాలు చదివి నేర్చుకొనేది అని, మూడవ భాగం తోటి విద్యార్థుల నుంచి నేర్చుకొనేది అని, నాలుగవది దేశాటనం చేసి నేర్చుకొనేది అని మన పూర్వీకులు తాటాకు గ్రంథాల్లో వ్రాసి పేట్టేశారు. అంచేత ఎంచక్కా యూనివర్సిటీ చదువు నాలుగేళ్లు ఉంటే ఒకో భాగానికి ఒకో ఏడాది కేటాయించడానికి వీలవుతుందని మా రోజుల్లో ఇంజనీరింగ్ చదువు నాలుగు సంవత్సరాల చదువుగా పెద్దలు నిర్ణయించి సత్సంప్రదాయాన్ని నెలకొల్పి కట్టమంచి వారి మీద తమ గౌరవం ప్రకటించారు.

ఇంతకు చెప్పొచ్చిందేమిటంటే నాలుగేళ్ళ చదువు మాది. మొదటి సంవత్సరం గురువులు బోధించేది శ్రద్ధగా విని పరీక్షలు వ్రాసేవారు విద్యార్థులు. రెండో సంవత్సరం వచ్చేసరికి ఆ పద్ధతిలోని సాధక బాధకాలు అర్థమయ్యేవి. మేష్టర్లనుంచి నేర్చుకోవడానికి క్లాసులో మేలుకొని కూర్చోవటం అవసరం కదా! మధ్యలో ఓ చిన్న కునుకు తీస్తే కనెక్టింగ్ లింకులు ఎగిరిపోయి బిల్డింగ్-శాండ్-స్ట్రక్చర్‌లాంటి తప్పుదార్లు పట్టించే పదజాలం పట్టుబడిపోతుంది. అందుకని విద్యార్థులు రెండో సంవత్సరంలో క్లాసులో నిద్రని పాడుచేసుకోలేక (ముఖ్యంగా ఆ క్రితం రోజు సెకెండ్ షో చూసి హాస్టలుకి నడుచుకుంటూ రావటం వల్ల) పుస్తకాలు పుచ్చుకొని చదువుని తలకెక్కించుకోవాలని చూసేవారు. మూడో సంవత్సరం సివిల్, మెకానికల్, ఎలెక్ట్రికల్ అంటూ కులాల వారీగా విడిపోయాకగాని బ్రహ్మోపదేశం జరిగేది కాదు. మూడో సంవత్సరంలో తోటి విద్యార్థులైన సీనియర్ల నుంచి అసలు విద్యాసారం గ్రహించేవాళ్ళు. సీనియర్లు గీతోపదేశంతో శ్రీ కృష్ణ పరమాత్ముడిలాగా "ఓరి వెర్రివెంగన్నా రావులూ! సీనియర్ల నడగకుండా పరీక్షలు పాసయ్యే మార్గాలెల్లా తెలుస్తాయి! అర్జెంటుగా అయిదు రోజుల్లో అరవై షీట్లు గియ్యాలంటే ఏం చేస్తారు మీరు? కాపీ కొట్టిన డిజైన్ కొట్టనట్టు కనిపించడానికి వాడకంలో ఉన్న చిట్కా లేమిటి? ఏ మేష్టర్లు కెంతెంత పొడుగు అన్సర్లిష్టం? ఎస్ట్రొనామికల్ సర్వేలో మీ రిస్టు వాచి ఆగిపోతుంది-

అప్పుడేం చేస్తారు?" అంటూ ప్రశ్నలు వేసి ఊదర గొట్టి సలహాలు పారేసి వాళ్ళ పాత డిజైన్లు, డ్రాయింగులూ ఇచ్చి సహాయం చేసేవారు. నాలుగో సంవత్సరంలో విద్యార్థులు "ప్రపంచాన్ని చూసి మేమే నేర్చుకొంటాం. మమ్మల్ని అల్లా తిప్పి తీసుకురండి" అని అడిగే ధైర్యం చేయటం ఓ ఆనవాయితీ.

అందుచేత నాలుగో సంవత్సరంలో మేము కూడా విద్యా సముపార్జనకి దేశాటనం చేసాం. నా చిన్నప్పుడు 'నాకు నచ్చిన పండుగ - తరగతి విహారయాత్ర' అని 'మా ప్రతి తరగతిలోను కాంపొజిషన్లు వ్రాయించారు. స్కూళ్ళు మారినా టాపిక్స్ మారలేదు. "మేష్టారూ! ప్రతి యేడూ ఒకటేనా కాంపోజిషన్?" అంటే "వెధవల్లారా మీరు గత సంవత్సరం సింహాచలం వెళ్ళారు. ఈ ఏడాది సీతమ్మధార వెళ్ళారు" అని నోర్మూయించేవారు. అందుకని పర్వత లింగేశ్వరరావుగారేదైనా కాంపొజిషన్ వ్రాసి పంపమనగానే ఆయన మనస్సులోది. 'మా తరగతి యాత్ర' అయివుంటుందని గ్రహించి పోనీ అదే వ్రాద్దాం. వేరొండు వ్రాయగనేల? అని మొదలు పెట్టాను. విశ్వనాథంవారు రామాయణం వ్రాస్తూ "రోజూ తిన్న అన్నమే తినడం లేదా? చేసిన పని నచ్చితే చేస్తూ పోవచ్చు. పునరుక్తిదోషం ఉండదు" అంటూ భరోసా ఇచ్చారు.

దేశాటనం అన్నింటిలోకి బెస్టు. నాకు ఇంజినీరింగ్ ఫస్ట్ ఇయర్‌లో 56 శాతం, సెకండ్ ఇయర్‌లో 58 శాతం, మూడోయేడు 68 వాతం, నాలుగో యేడు 70 శాతం మార్కులు వచ్చాయి. ఇంతకంటే బుజువేం కావాలి? అన్నింట్లోకి దేశాటనమే సరైన విద్యాసముపార్జన మార్గం అనటానికి నాలుగు పద్ధతుల తారతమ్యాలు తెలిసిపోవడంలా!

పోతే నా రచన కోరినవారు "మీ రోజుల గురించి సరైన అవగాహన కలగటానికి వీలుగా వ్రాయాలి" అని ఆజ్ఞాపించారు. అంటే ఇది చరిత్ర. అవాకులు చవాకులు వ్రాస్తే పనికిరాదు. ఇది సావెనీర్ పుటలో పాతిపెట్టబడే టైమ్ కాప్స్యూల్. దీన్ని ఏ వెయ్యేళ్ళ తరువాతో వెలికిదీసి చదివితే నేనేం వ్రాసినా ఆ తరం నమ్ముతుంది. మనం రాములవారి కాలంలో విమానాలున్నా యని, భారత యుద్ధంలో ఇప్పటి ఆర్మీలను మించిన సేనలు పాల్గొన్నాయని నమ్మడం లేదూ! అల్లా అన్నమాట. కాని ఏ కిట్టని వాళ్ళో మధ్యాంతరంగా దీన్ని జనతా ప్రభుత్వం లాగా వెలికి తీసి, ఇది తప్పు అది తప్పు. శర్మ తన గురించి వ్రాసుకొన్నంత గొప్పవాడు కాదు అంటూ దుమారం లేపడానికి అవకాశం లేకపోలేదు. అందుకని దీన్ని చాలా జాగ్రత్తగా వ్రాయాలి. ఇందులో కొన్ని పేర్లు రాక తప్పవు. వాళ్ళు పరువు నష్టం దావా వెయ్యకుండా చూచుకోవాలి. అల్లా అని వాళ్ళ గురించి చాలా మంచివాళ్ళని అబద్దాలు ఆడరాదు. ఇవన్నీ కన్‌స్ట్రైయిన్స్!

కథ గురుస్తుతితో మొదలుపెడ్తాను. నేను కృష్ణమాచారిగారి దగ్గర చదువుకొన్నాను. మాది రెండో బాచ్. మా అన్నయ్య, బావగారు కూడా ఆయన్దగ్గర కాకినాడలో చదువుకొన్నారు. అక్కడ వాళ్ళది రెండో బాచ్. నేను ఆయన్దగ్గర చదువు నిమిత్తం జేరగానే నా హితులిద్దరు "ఆయన చాలా స్ట్రిక్టుగా ఉంటారు. బుద్ధిగా ఉండు" అని బుద్ధులు చెప్పారు. ఇంక సీనియర్లు "మామూలుగా మేష్టర్ల ఇళ్ళల్లో బాచ్‌ల వారిగ ఫొటోలు వేళ్ళాడదీసి ఉంటాయా! మరి కృష్ణమాచారి గారింట్లో బాచ్‌లవారిగా డొళ్ళు వేలాడదీసి ఉంటాయి. వారు పిచ్చి వేషాలు వేసినవారి డొక్కలు

చించి డొక్కకో డోలు కడ్తారు. మొన్నా మధ్య వాళ్ళావిడ, డాక్టరు మార్తాండశాస్త్రిగారి దగ్గరకు చెయ్యి నొప్పని వెళ్తే, 'మీ ఆయన కట్టిన డోళ్ళన్నీ వేళ్ళాడదీస్తూ పోతుంటే చేతులకి నొప్పుల్లాక బంగారు గాజులొస్తాయా? నేల మీద గోడ వారగా పేర్చుకొంటూపోతే చాలదూ' అంటూ మందలించారు తెలుసా" అంటూ భయపెట్టారు. అయితే నిజానికి మేష్టారు కింతంత పెద్ద మీసాలు గాని ఎర్ర జీరున్న కళ్ళుగాని చేతిలో డొక్కచించే కత్తి కాదు కదా ఓ చిన్న బెత్తంగాని ఉండేవి కావు. ఆయన శాంతంగా గోవులా ఉండేవారు. కాని ఆయన్నందరూ పులి అనేవారు. కాని అది నిజం కాదని ఆయన గోవేనని బుజువు చేసే కథ యిది. అయితే కథకి నాయకుడు ఆయన కాదు. కథానాయకుడు బంగారేశ్వర శర్మగారు. ఆయన యింటర్వల్ తరువాత వస్తాడు కథలో.

అది 1959వ సంవత్సరం. మాలో వెల్లివిరిస్తున్న ఉత్సాహం. ఆ సంవత్సరం మేం దేశం నలుమూలలా చూడబోతున్నాం. ఆ క్రితం యేడు సీనియర్లు నార్తు చూశారు. మాక్కూడా నార్తు పోయి పంజాబీ అమ్మాయిల్నీ వాళ్ళనీ చూసి జన్మ ధన్యం చేసుకోవాలన్న కోర్కెగా ఉంది. ఒక రోజున "ఇవాళ కృష్ణమాచారిగారు టూర్ ప్రసక్తి తెస్తారుట" అని బి. సుబ్బారావు వార్త పట్టుకు వచ్చాడు. మేం రిహార్సల్స్ వేసుకొన్నాం. ఆయన "ఎటువేపు వెళ్తారు?" అని అడుగగానే అప్పుడు మేమంతా "నార్త్" అని ముక్త కంఠంతో అని అరవాలని.

మేష్టారు క్లాసులోకి వచ్చారు. స్టీల్ డిజైన్ గురించి రెండు వాక్యాలు మాట్లాడారు. క్షమించాలి ఇది చరిత్ర కదా! కథా ప్రదేశ వర్ణన ముఖ్యం. అప్పటికింకా ఇంజనీరింగ్ వాళ్ళకి స్వంతదంటూ నెత్తి మీద టోపేరం లేదు. అందుకని అర్జెంటుగా పెంకుల్లేచిపోయిన మెస్సులు రెండు వాయువ్య మూలలో సంపాదించారు. ఫైనలియర్ వాళ్ళకి డిజైన్లూ, డ్రాయింగులూ నేర్పుతున్నారు ఒక దాంట్లో. రెండోదాంట్లో విద్యార్థులు టేబుల్ టెన్నిస్, లిటరేచర్ ఆడుకొనేవారు. మా అందరికి ఈ రెండో మెస్సుతో ఎన్నో మధుర స్మృతులు ముడిపడి ఉన్నాయి. ముడిపడని మెస్సులో క్లాసు జరుగుతోంది. మేం పాఠం వినడం లేదు. మా కళ్ళ ముందు, అందమైన పంజాబీ అమ్మాయిలు మాకేసి చూసి నవ్వుతూ అటూ యిటూ తిరుగుతూ ఉంటే పాఠాలు వినడం ఎంత కష్టం! అందుకనే వినడం లేదు.

మేష్టారు, "ఎక్కడున్నాయి మీ మనస్సులు?" అని కసిరారు.

అయితే మేం ఆయన మమ్మల్ని ప్రశ్న వెయ్యగానే ముక్తకంఠంతో ధైర్యంగా జవాబివ్వాలని వేసుకొన్న రిహార్సల్స్ వల్ల "నార్త్" అరిచాము.

"అయితే దేహాల్ని క్లాసు బయటికి నడిపించండి" అన్నారు మేష్టారు. అటువంటి సమయాల్లో మేం మేష్టర్లకి ఎదురాడి ఎరుగం. పేకలు, టేబుల్ టెన్నిస్ బాల్స్ తీసుకొని రెండో మెస్సుకి పోడానికి సిద్ధపడ్డాం. కృష్ణమాచారిగారికి తను చేసిన తప్పు అర్థమైంది. విద్యార్థుల క్లబ్ చేతివాటు దూరంలో ఉన్నచో విద్యార్థుల్ని బయటకు నడవమంటే అది బెదిరింపు కాజాలదనీ అది వరం మాత్రమే అవుతుందనీను అర్థమైపోగానే-

"కూర్చోండి" అన్నారాయన గంభీరంగా.

కూర్చున్నాం.

"నార్తేమిటి?" అని అడిగారాయన.

"మరిమో సుబ్బారావండి....మీరండి....నార్తండి... అది కాదండీ...టూరు కేసి నార్తండీ...కాదు కాదు నార్తుకేసి టూరండీ....మేమండి బోల్డ్ సరదా అంటే....ధైర్యం కాదండి....బోలెడు.... అంతేనండి" అంటూ మేం ఆయనకి చాలా బోల్డ్‌గా మా మనస్సులో మాట చెప్పేశాము.

ఆయన దానికి, "అయితే అబ్బాయిలూ మీరు నార్త్ వెళ్తారా? అక్కడ తిండీ తిప్పలు సరిగా ఉండవు. బ్రేక్ ఫాస్ట్ దొరకదు. హాయిగా సౌత్ పోదాం" అన్నారు.

"వద్దండి" అన్నాం మేం వినయంగా.

"వెళ్ళాలన్నది నా నిర్ణయం. తీసుకువెళ్ళేది నేను. రేపు మీలో మీరు ఓటింగ్ పెట్టుకొని సౌత్‌కి వెళ్ళాలన్న నిర్ణయం తీసుకొని నాకు ఆ విషయం చెప్పండి. కమింగ్ బాక్ టు ఏ సెక్షన్' ' అంటూ పాఠం మొదలు పెట్టారాయన.

ఆ మధ్యాహ్నం ఎదురుగా ఉన్న విద్యార్థుల విశ్రాంతి గదిలో మీటింగ్ జరిగింది. ఉదయగిరి మోహన్రావ్‌కి మేష్టారు చెప్పిన దాంట్లో ముఖ్యమైన విషయం అప్పీల్ అయింది. "అబ్బాయిలూ! మనం నార్త్ వెళ్తే ఇడ్లీలు దొరకవు. ఇడ్లీల్దొరకకపోతే మన మూడ్ పాడైపోతుంది. ఇంక దేశం ఏం చూస్తాం? అమ్మాయిల అందాన్నేం ఆస్వాదిస్తాం" అంటూ లాబీయింగ్ మొదలు పెట్టాడు. అతనికి ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఒకటే రంధి - తిండి రంధి. అందులోను ఇడ్లీ రంధి. (తమాషా ఏమిటంటే అతనిప్పుడు ఇండోర్‌లో ప్రొఫెసర్‌గా తలమ్ముకొన్నాడు. పొద్దున్నే బ్రేక్ ఫాస్ట్‌కి జిలేబీలు, అటుకులు తింటూ బతుకుతున్నాడు. అతి సర్వత్ర వర్జయేత్!). అందుకని అందరూ మోహన్రావ్‌ని "నోరెత్తావంటే మళ్ళీ ఇడ్లీలు తినడానికి వీలులేకుండా నోటికి సెల్లోటేపు వేసేస్తాం" అని బెదిరించారు.

మోహన్రావు మరి మాట్లాడలేదు. ఆ మీటింగులో మేష్టారికి మా నిర్ణయం మారబోదని చెప్పాలని నిర్ణయించుకొన్నాం.

ఆ మర్నాడు సుబ్బారావు (ప్రస్తుతం సంగ్లీలో ప్రొఫెసరుగా ఉన్నాడు) మరో న్యూస్ పట్టుకువచ్చాడు. లాస్టియర్ మేష్టారు వాళ్ళావిడకి నార్త్ చూపించారుట. ఈ యేడాది సౌత్ చూపించమని ఆవిడ కోరారుట. కనుక ఆరునూరైనా ఆయన ఆవిడకి, ఆవిడతోపాటు మాకు సౌత్ చూపిస్తారుట. దానికి తిరుగులేదుట. మేమంతా నీరుకారిపోయాం.

అనుకొన్న సమయానికి మేష్టారు వచ్చి "ఏమిటి మీ నిర్ణయం?" అని అడిగారు.

మేం నీరసంగా "నార్త్" అన్నాం.

"నా ఉద్దేశంలో మనం సౌత్ వెళ్ళటం మంచిది. నార్తే వెళ్తామని అనేవాళ్ళు చేతులెత్తండి." ఆయన ఇంగ్లండులో చదువుకొన్న అలవాటుకొద్దీ గ్లౌవ్ పడేసి సవాలు చేశారు.

పిల్లికైతే గంట కట్టచ్చు. పులికి? క్లాసులో ఎవరో డ్రాయింగు పిన్ను పడేసారు. ఆ శబ్దం

అందరికి వినిపించింది. ఇంక లాభం లేదు. దూరంగా పంజాబీ అమ్మాయిలు "మా గతేమిటి? రారా? కనరా" అంటూ దీనవదనలై బతిమాల్తున్నారు.

నేను చెయ్యి యెత్తాను. నాకు తోడుగా కాశీసోమయాజుల శ్రీనివాసరావు చెయ్యెత్తాడు. ఇతను నాకున్న ముఖ్య స్నేహితులలో ఒకడు. ప్రపంచంలో ఉన్న కొద్దిమంది మేధావుల్లో ఒకడో ఇద్దరో. ఇతని తెలివి తేటల్లో కొద్దిపాలు ఇతని మేనమామ కూతురు బీనాదేవి రచనల్లోను మేనమామ శ్రీశ్రీ రచనల్లోను కనిపిస్తాయి. అతన్ని మాటల్లో గెల్చినవాడిని నేను చూడలేదు. అంత బాగా పాఠాలు అర్థమైనవాడిని చూడలేదు. అతను రైల్వేస్‌లో జేరటంవల్ల రిసెర్చి ఒక ఐన్‌స్టీన్‌ని కోల్పోయింది! ఇతని గురించి మరోసారి వ్రాస్తాను. ఇంతకు, అతని తరువాత బత్తుల వీరవెంకట సత్యనారాయణ, ఉప్పల వెంకట నారాయణరాజు చేతులు ఎత్తారు. తరువాత డే-స్కాలర్స్, ఆపైన క్లాసు మొత్తం. అయిదు నిముషాలు పట్టినా ఏకాభిప్రాయం వ్యక్తమయింది.

ఆ తతంగం పూర్తయ్యేవరకు మాకెవరికి మేష్టారి మొహంలోకి చూసే ధైర్యం లేక పోయింది. నెమ్మదిగా తలెత్తి ఆయన ముఖంలోకి చూసాం. ఆయన మొహంలో కోపం లేదు. పైగా మా ధైర్యానికి ఆయన మొదట చిరునవ్వు నవ్వి ఆపైన పక పకా నవ్వారు. ఆయన గురించిన నిజం మా కర్థమైంది, నాల్గో సంవత్సరం చివర్లో ఆ రోజున. ఆయనంటే విద్యార్థులు భయపడేవారే కాని ఆయన భయ పెట్టేవారు కారు! అని. కాని ఎందుకైనా మంచిదని ఆ తరువాత కూడా భయపడ్తూనేం ఉన్నాం.

"సరే మీరే గెల్చారు. అయితే మీతో నేను కాకుండా మరొకరు వస్తారు" అన్నారు ఆయన.

మా మనస్సులు ద్రవించి పోయాయి. "కాద్సార్ మీరే రావాలి. మీలాంటి పెద్దలుంటేనే ప్రయాణం సుఖంగాను, క్షేమంగాను జరుగుతుంది" అన్నాం.

"అయితే నార్త్ వద్దు, సౌతూ వద్దు. మధ్యగా పోదాం. పూరీ, కలకత్తా, హీరాకుడ్, నాగపూర్, బొంబాయి, హైదరాబాద్, నాగార్జున సాగర్, బెంగుళూరు, మైసూర్, మద్రాస్, బెజవాడ, విశాఖపట్నం." సూచించారాయన.

బెంగాలీ అమ్మాయిలు, మహారాష్ట్రపు అమ్మాయిలు, కన్నడపు అమ్మాయిలు ఇదీ బానే ఉందని వెంటనే ఒప్పేసుకొన్నాం. ప్రోగ్రాంలో ఊళ్లు ఫైనలైజ్ అవగానే "ఏ వూళ్ళో ఏం చూడాలన్నది మేష్టర్లు నిర్ణయిస్తారు" అన్నారు కృష్ణమాచారిగారు.

"సరే" అన్నాం. అయితే పొంచున్న ప్రమాదం అర్థమైంది ఆ తరువాత.

కలకత్తా సూయేజ్ వర్క్స్, దాదర్ సూయేజ్ వర్క్స్, హైదరాబాద్ సూయేజ్ ఫామ్ అంటూ శివాజీరావుగారు చేతనైనంత సూయేజ్‌ని ప్రోగ్రాంలో పెట్టేశారు. అయితే యేం యాత్ర యాత్రే!

ఇక్కడ ఇంటర్వల్. ఈ పైన కథ చక చకా నడచి పోతుంది.

మాతోపాటు టూర్‌కి రావటానికి బంగారేశ్వర శర్మగారు కూడా అంగీకరించారు.

ఆయన అప్పుడు ఏ కష్ట సాధ్యమైన పనికైనా ఆనందంగా తలవంచే మూడ్‌లో ఉన్నారు. ఆయన అసలు తల వంచటం అద్దం ముందు నిలబడి ప్రాక్టీస్ చేస్తుండేవాడు ఆ రోజుల్లో. రేపాయనికి పెళ్ళయితే పెళ్ళికూతురు మెడలో దండవేస్తానంటుందికదా! భార్య రా తలడ్డు పెట్టువాడుండునా? ఉండడు! అందుకని కొంచెం కష్టమే అయినా తల వంచాలి! అంటే దానికి కొంత అభ్యాసం ఉండాలి. అల్లా అభ్యాసం చేస్తున్న రోజుల్లో కృష్ణమాచారిగారు "కోతి మూకతో టూ రెళ్లాలి రండి" అన్నారాయన్తో, శర్మగారు తల వంచి శిరసావహించారు.

ఒక డెబ్భై ఆరు సీట్లున్న పెట్టెను కృష్ణమాచారిగారు రైలు దారి వారితో రాను పోను మాట్లాడారు. ఉన్నది మేం నలుభై నలుగురం, మేష్టారి కుటుంబం ఇద్దరు పెద్దలు, ఇద్దరు అర టిక్కెట్లు, సహాయానికి ప్యూన్, బంగారేశ్వరశర్మగారు, ఎక్కువ సీట్లు కొంటే అందరం హాయిగా పడుక్కోవచ్చని నెల రోజుల టూర్ సుఖంగా జరగటానికి కాళ్ళు జాచుకొనే జాగా ముఖ్యం అనీ అల్లా ఏర్పాటు చేశారు.

రైలు రాగానే అందరం బోగీ మీదకు ఎగబడ్డాం. అందులో రెండు పెద్ద పెట్టెలూ రెండు చిన్న పెట్టెలూ, ఉన్నాయి. ఒక చిన్న పెట్టె మేష్టర్లకి వదిలిపెట్టాం. రెండో చిన్న పెట్టెలో ఎక్కిన గుంపుకి తరువాత 'బిగ్‌షాట్స్' అన్న నిక్‌నేమ్ వచ్చింది. పెద్ద పెట్టెలో మిగిలిన విద్యార్థులం అందరం సర్దుకొన్నాం. మా పెట్టెలో ఇద్దరు అధికం అయ్యారు. కృష్ణమాచారిగారి పెట్టెలో ఖాళీలు మిగిలిపోయాయి.

ఆయన,"ఎవరైనా మా పెట్టెలోకి రండి" అని మా పెట్టె నుద్దేశించి జనాంతికంగా అన్నారు. పులి పిలిచిందికదా అని ఎవరెళ్తారు బోన్లోకి? ఇక్కడ మేష్టారి గురించి ఓ చిన్న కథ చెప్పాలి.

కృష్ణమాచారిగార్కి కుర్రాళ్ళు సరిగ్గా డ్రెస్సవ్వకపోతే కోపం. ఆయనోసారి క్లాసులో మా సీనియర్‌ని చొక్కా బొత్తాలు పెట్టుకోలేదని కేకలేసారట. దాంతో ఆ సీనియరు సివిల్ చదవక కాకినాడ వెళ్ళి టెలికమ్యూనికేషన్స్ చేసి కాన్పూరెళ్ళిపోయి ప్రొఫెసర్ అయిపోయి క్లాసుకి చొక్కా బొత్తాలు పెట్టుకొచ్చిన విద్యార్థుల్ని కేకలేస్తున్నారట.

ఇంతలో ఆయన పెట్లో ఎక్కితే ఇరవై నాలుగు గంటలూ చొక్కాకి బొత్తాలు పెట్టుకొని కూర్చోవాలి. బట్టలు పక్కమీద పడేసుకోకుండా మడతలు పెట్టుకోవాలి. అందుకని మోహనరావు నా పెట్టె, తన పెట్టె ఒక దానికొకటి జేర్చి పడుక్కోడానికైనా ఒప్పుకొన్నాడుగాని మేష్టారి కంపార్ట్‌మెంటులోకి వెళ్ళటానికి ఒప్పుకోలేదు. క్లాసులో ఒకరిద్దరు పకోడీలు లేకపోలేదు. వాళ్ళు బటర్ పాకెట్స్ తీసుకొని మేష్టారి కంపార్ట్‌మెంటులోకి ఎక్కేసి, "పిన్నిగారూ! మీ అబ్బాయిలకి మేము బిస్కెట్లు కొని పెట్టొచ్చా? మే వుయ్ ప్లీజ్" అంటూ గురుపత్నిని మొహమాట పెట్టేసే కార్యక్రమంలో పడ్డారు ముందునించి. అయితే అటువంటివారు చాలా తక్కువ అవడంతో చోటు మిగిలింది. పకోడీలకి పోటీ ఇష్టం లేదు. మరికొందరితో చోటు పంచుకొని సుఖం త్యాగం చెయ్యటం ఇష్టం లేదు. కాని మేష్టారూరుకోలేక, "సుబ్బారావు! నువ్వు రా మా పెట్లోకి" అని వాలంటీరిని ఎన్నుకొన్నారు.

"వద్దు మేష్టారు. ఫామిలీతో ఉన్నారా! నేను వస్తే ఇబ్బంది. రాకపోతే కొంచెం సుఖంగా ఉంటుంది" అని నసిగినా చివరికి సుబ్బారావు ఓడిపోయాడు. అతను ఆ పెట్టెలోకి ఎక్కుతూ మాకేసి చూసిన చూపు నాకింకా గుర్తుంది. ఆసీళ్ళమెట్ట దగ్గర మేకలు చూసే చూపు అది. ఏం చేస్తాం! అది మేం కానందుకు సంతోషించడం తప్పించి.

టూర్‌లో చెప్పుకోదగ్గ సంఘటనలు చాలా ఉన్నా అవన్నీ ఒక చోట చెప్పను. మా పెట్టెలో పెద్ద విశేషం బులుసు సత్యనారాయణ. ప్రొద్దున్నే బాత్రూమ్‌లోకి వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకొని స్నానంచేసి, బట్టలుతుక్కొని, సంధ్యావార్చుకొని బయటికి వచ్చేవాడు ఒక గంట తరువాత, అల్లా అయితే ఎల్లా? అని దెబ్బలాడితే నాలుగింటికే లేచి బాత్రూమ్‌లోకి వెళ్ళి నీళ్ళన్నీ ఖాళీ చేసేవాడు. తరువాతివాళ్ళకి నీళ్ళు మిగలకపోగా కంపార్ట్‌మెంటులో అందరికి నిద్రాభంగం కూడా అయ్యేది. అతనిప్పుడు ఆయిలే తప్ప నీళ్ళులేని ఇరాక్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నాడు. అంతగా నీళ్ళువాడే అతనికి నీళ్ళు దొరకవు అక్కడ. అతి సర్వత్ర వర్జయేత్!

ఏక్షన్ అంతా మేష్టారి కంపార్ట్‌మెంటులో జరిగేది. బంగారేశ్వర శర్మగారు, బ్రిడ్జి మీద రైలు పోతుంటే "ఎన్‌గర్డర్లో సుబ్బారావు! టెన్షనా కంప్రెషనా ఉండేది?" అనో లేక "ఇదిగో ఈ సాయిల్ బ్లాక్ కాటన్ సాయిల్ చూసావా" అనో సుబ్బారావు తలకి విజ్ఞానమంతా మర్దించే వారుట. రోజు రోజుకి సుబ్బారావు తల సైజు పెరుగుతుంటే మేం కుతూహలం కొద్దీ అడిగితే అతను చెప్పాడు "తల వాచిపోతోంది" అని.

బంగారేశ్వరశర్మగారు కాబోయే భార్యకి కలకత్తాలోను, బొంబాయిలోను చీరలు కొన్నారు. అంతవరకు బాగానే ఉంది. కాని ఓ అర్ధరాత్రి లేచి "అవి కోకిల కూజితాలు కావూ!" అన్నారుట.

"మేష్టారూ వసంతం మరో మూడ్నెల్లదాకా రాదు" అన్నాడుట సుబ్బారావు.

మరో అర్ధరాత్రి లేచి "చూడవోయి సుబ్బారావు! ఆ దూరంగా మినుగు మినుగుమనే లైట్లు ఆకాశంలో తారల్లా లేవూ! ఆ తారు రోడ్డు ప్రేయసి నల్లని జడల్లా లేదూ!" అన్నారుట. సుబ్బారావు కోసినా కోసుంటాడు! కాని నిజమేమిటంటే బంగారేశ్వరశర్మగారికి ఆ రోజుల్లో ప్రపంచం అంతా వెన్నెల, కోకిల కూజితాలు, పిల్లగాలులు, ప్రియురాలి జడలు... వీటితో నిండి ఉండేది, పెళ్ళి మరో రెండు నెలల దూరంలో ఉండటం వల్ల.

కథ చివరికి వచ్చేసాం. శర్మగారికి ఆ రోజుల్లో చాలా ఇనిషియేటివ్ డ్రైవ్ ఉండేది. ఇప్పుడుందో లేదో తెలియదు. దాని గురించిన కథే ఇది. మేము హైదరాబాద్ వెళ్ళాం. అక్కడ్నుంచి నాగార్జున సాగర్ వెళ్ళాలి. ఓ బస్సు మాట్లాడాలి. 'ఆ పని నేను చేస్తాను' అన్నారు శర్మగారు.

హైదరాబాదులో డ్రైవర్లకి రాని భాషంటూ లేదు, తెలుగు తప్పించి. కాని ఉర్దూ కలిసిన హిందీ అంటే వాళ్ళ కిష్టం. మా క్లాసులో సుధేష్ కుమార్ పూరీ, అవతార్ కిషన్ భట్ అని పంజాబీ వాళ్ళుండేవారు. వాళ్ళు మమ్మల్ని మద్రాసీలంటూ ఉండడం చేత నార్తులో ఉన్నవాళ్ళం దర్నీ కలిపి జమిలిగా మేము పంజాబీ వాళ్ళని రిఫర్ చేసేవాళ్ళం. టిట్ ఫర్ భట్, భట్ కాశ్మీరీ.

ఇంతకూ వాళ్ళు "షర్మాజీ! బస్సు వాళ్ళతో హిందీలో మేము మాట్లాడ్తాం. మీరు వద్దు" అని చెప్పి చూసారు.

షర్మాజీ ఒప్పుకోలేదు. ఆయన, బస్సు మర్నాడు పొద్దున్న నాలుగింటికి వచ్చి మధ్యాహ్నానికి నాగార్జున సాగర్ తీసుకువెళ్లే ఏర్పాటు చేసారు. మేము ప్రొద్దున్నే తయారై కూర్చున్నాం. బస్సు ఎంతసేపటికి రాలేదు. పోనీ ఎక్కడికైనా పోదాం అంటే ఏ క్షణాన్న వస్తుందో అన్న భయం, సాయంత్రం  నాలుగింటికి బస్సు వచ్చింది. మేమంతా వాళ్ళ మీద విరుచుకొని పడ్డాం, విసుగుతో కోపంతో.

"మీ ఉస్తాద్ మాకు ఎపుడూ రమ్మని చెపితే అపుడే వచ్చామ్. మాది తప్పు లేదు" అని వాళ్ళన్నారు.

కాస్సేపు గొడవ అయ్యాక తేలిందేమిటంటే మేష్టారికి ప్రేమించిన అమ్మాయిని పెళ్ళికి ఒప్పించే భాషే వచ్చుకాని డ్రైవర్లతో మాట్టాడ్డానికి హిందీ రాదని.

రాత్రి ఒంటి గంటకి బస్సు నాగార్జున సాగర్ జేరింది. అందరికి శర్మగారి మీద కోపంగా ఉంది, నిద్రగా ఉంది.

"నైట్ వ్యూ ఆఫ్ ది డామ్ చూద్దాం పదండి" అంటూ శర్మగారు లీడ్ చేసారు ఆ విషయం గమనించకుండా.

మేమంతా నిద్రకాగలేక ఎక్కడివాళ్ళం అక్కడ నిద్రపోయాం, శర్మగారు వెనక్కి తిరిగి చూడకుండా విద్యార్థులకి డామ్ గొప్పతనంవివరిస్తూ డామ్ దాకవెళ్ళి వెనక్కి చూస్తే.... ఏరి విద్యార్థు లేరి??

ఇరవై ఒక్క సంవత్సరాల తరువాత వెనక్కి తిరిగిచూస్తే.... ఆ యాత్ర నైట్ వ్యూ ఆఫ్ ది డామ్ లాగా అందంగా కనిపిస్తోంది. ఆ రోజులు బంగారు రోజులు. మళ్ళీ రావు.

*- ఇంజినీరింగ్ కాలేజి సిల్వర్ జూబ్లీ సంచిక '80*

★